
సాక్షి వికారాబాద్

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



కొడంగల్.. దంగల్!

నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పునివ్వడంలో నిష్ణాతులు.1983లో ఎన్టీఆర్ ప్రభంజనం లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. 10లో▸



ఎవరైనా నెగ్గు!

నాలుగు దశాబ్దాలుగా మోమిన్‌పేట మండల ప్రజలు మద్దతు తెలిపిన అభ్యర్థులే ఎమ్మెల్యే లుగా విజయం సాధించారు. 10లో▸



ఆరుబయటే కార్యకలాపాలు

గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో పాలకవర్గం, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన హఫీజ్



కేసీఆర్‌కు నమస్కరిస్తున్న హఫీజ్, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌కు చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ హఫీజ్ గురువారం సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో ఆయన సీఎంను కలిశారు.

6నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి సెలక్షన్స్

అనంతగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 6నుంచి వివిధ క్రీడలకు సంబంధించి జిల్లా స్థాయి సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సింలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తాండూరులోని తులసి గార్డెన్స్‌లో అండర్ -14, అండర్ -17 తైక్వాండో సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లోని సెయింట్ జూడ్స్ పాఠశాలలో బాస్కెట్ బాల్ సెలక్షన్స్, 8వ తేదీ వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తమ వెంట అర్హత సర్టిఫికెట్, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, లాస్ట్ ఇయర్ ప్రోగ్రెస్ రిపోర్టు తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 82475 11591, 9989071269, 7702663539లో సంప్రదించాలన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు చేయండి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో మద్యం అక్రమ రవాణా, సారా, మత్తు పదార్థాల విక్రయం వంటి విషయాలు తెలిస్తే ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం అక్రమ రవాణా, విక్రయంపై టోల్ ఫ్రీ నంబర్ 18004252523, లేదా సెల్ నంబర్ 80745 59147కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారంటీలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ధారూరు: వారంటీ లేని కాంగ్రెస్ లీడర్లు ఆరు గ్యారంటీలు ఇస్తామని మాయమాటలు చెబుతున్నారని, వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని మున్నూరు సోమారం, కొండాపూర్ కలాన్, ధర్మాపూర్, నర్సాపూర్, గడ్డమీది గంగారం, కుక్కింద, అవుసుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీతో ఉంటూ మీ మాట వినే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. ఓట్లు కోసమే కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తున్నారని, వారిని నమ్మితే గోస పడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, పార్టీ నాయకులు రాజు నాయక్, వేణుగోపాల్‌రెడ్డి, సంతోష్, వెంకటయ్య, హఫీజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

కాంగ్రెస్ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో దోమ మండలం గూడూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని, రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు.

స్వీకరణకు శ్రీకారం

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ..

- 10వ తేదీ వరకు అవకాశం
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లు
- ఓటర్లు 9,34,523
- పోలింగ్ కేంద్రాలు 1,133
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

నామినేషన్ల ప్రారంభం	-	03.11.18
చివరి తేదీ	-	10.11.18
స్క్రూటినీ	-	13.11.18
ఉపసంహరణ	-	15.11.18
పోలింగ్	-	30.11.18
కౌంటింగ్	-	03.12.18



వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్

వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కీలక ఘట్టానికి గురువారం నుంచి తెరలేవనుంది. నేటి నుంచే నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసులు కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వికారాబాద్, తాండూరు ఆర్డీఓ కార్యాలయాల్లో, పరిగి, కొడంగల్ తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు.

నిబంధనలు ఇవే..

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవకాశం ఉంది. నామినేషన్ వేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 5వేలు, జనరల్ అభ్యర్థులు రూ. 10వేలు చెల్లించాల్సి ఉంటుంది. నగదు లేదా చలాన్ రూపంలో చెల్లించవచ్చు. అభ్యర్థితో పాటు మరో నలుగురు, మూడు వాహనాలకు మాత్రమే నామినేషన్ కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది. నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోనే అనుచరులు, కార్యకర్తలు ఉండాలి. నామినేషన్ పత్రంలోని అన్ని అంశాలను పూరించాల్సి ఉంటుంది. ఆ కాలంలో నింపాల్సిన వివరాలు లేకుంటే లేదు, వర్తించదు అని రాయాలి. అంతేగాని డ్యాష్ (-) వంటివి రాయరాదు. ఒక అభ్యర్థి నాలుగు నామినేషన్ల దాఖలు వేయవచ్చు. ఫారాలు ఉచితంగా ఇస్తారు. అభ్యర్థి తన పేరిట కొత్త బ్యాంక్ ఖాతా తీయాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 1,133 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

నిబంధనలు పాటించాలి



పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ విధించిన నియమావళిని తప్పని సరిగా పాటించాలి. అభ్యర్థులు రోజువారి షెడ్యూల్‌కు సంబంధించి 48 గంటల ముందే ఆర్‌ఓ నుంచి అనుమతి పొందాలి. ఇందుకోసం అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. నామినేషన్ వేసే అభ్యర్థి ముందుగా ఆర్‌ఓను సంప్రదించి కావాల్సిన ధ్రువపత్రాల గురించి తెలుసుకోవాలి. కులాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలి. ప్రలోభాలకు గురి చేసే ప్రసంగాలు చేయరాదు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రచారంలో అనుమతులు లేని వాహనాలు ఉంటే సీజ్ చేస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

జిల్లాలో నామినేషన్ దాఖలు కేంద్రాలు

నియోజకవర్గం పేరు	నామినేషన్ కేంద్రం	రిటర్నింగ్ అధికారి
వికారాబాద్	ఆర్డీఓ కార్యాలయం	రాహుల్‌శర్మ
తాండూరు	ఆర్డీఓ కార్యాలయం	శ్రీనివాస్
పరిగి	తహసీల్దార్ కార్యాలయం	విజయకుమారి
కొడంగల్	తహసీల్దార్ కార్యాలయం	లింగ్యానాయక్

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రా.జ	మొత్తం ఓటర్లు
పరిగి	1,27,835	1,24,537	07	2,52,379
వికారాబాద్	1,11,605	1,11,780	13	2,23,398
తాండూరు	1,11,242	1,17,243	10	2,28,495
కొడంగల్	1,14,140	1,16,099	12	2,30,251
మొత్తం	4,64,822	4,69,659	42	9,34,523

ఆశీర్వదించండి అండగా ఉంటా

- కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- మున్సిపల్ కార్మికులతో సమావేశం

తాండూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఆ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పాత తాండూరులో మున్సిపల్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటానని, ప్రస్తుత ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని కోరారు. మున్సిపల్ కార్మికులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్మికులు ఏళ్ల తరబడి పని చేస్తున్నా రెగ్యులరైజ్ చేయలేదని మండిపడ్డారు. వేతనాలు కూడా సరిగ్గా చెల్లించడం లేదన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వడ్డే శ్రీనివాస్, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి



టిఫిన్ సెంటర్‌లో పూరీలు వేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

- కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పరిగిలో ఎన్నికల ప్రచారం

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు గ్రామాలు, పట్టణాలు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలే గుర్తించాలని సూచించారు. గతంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కావన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు నేరుగా పథకాలు అందాయని గుర్తు చేశారు. అది కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, జెడ్పీ కోఆప్షన్ జిల్లా మాజీ సభ్యుడు మీర్ మహ్మద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్లు కిరణ్, వెంకటేష్, రవీందర్, కృష్ణ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వ్యయ పరిశీలకులు



పూడూరు: కంకల్ లిక్కర్ డిస్టలరీని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు గురువారం ఎన్నికల వ్యయ పరిశీలకులు వచ్చారు. అనంతగిరి హరిత రిసార్ట్‌లో రత్నాకర్ కాలో, మునీష్ రజనీకి కలెక్టర్ సీ నారాయణ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రత్నాకర్ కాలో ఐఆర్‌ఎస్ తాండూరు, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా, వికారాబాద్, పరిగి నియోజకవర్గాలకు మునీష్ రజనీ ఐఆర్‌ఎస్‌లు వ్యవహరించనున్నారు. జిల్లాలోని నియోజకవర్గాలు, రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులపై వారు ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బృందావన్ లిక్కర్ ఫ్యాక్టరీ పరిశీలన

పూడూరు: మండలంలోని కంకల్‌లో గల బృందావన్ స్పిరిట్ లిమిటెడ్ లిక్కర్ ఫ్యాక్టరీని గురువారం కలెక్టర్ సీ నారాయణరెడ్డి పరిశీలించారు. డిస్టలరీలో మద్యం ఉత్పత్తి, సరఫరాపై కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుజిత్‌రావును అడిగి తెలుసుకున్నారు. డిస్టలరీలో వివిధ రకాల మద్యం తయారు చేయడం జరుగుతుందని, పూర్తి స్థాయిలో ప్యాకింగ్ చేసిన తర్వా తే తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఫ్యాక్టరీ వద్ద రిటైల్ అమ్మకాలు ఉండవని, ఎలాంటి అవకతవకలకు పాల్పడే అవకాశం లేదని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆప్కారీ జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర,సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమే

- కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- స్థానికులకే పట్టం కట్టండి
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



ఉరేంటితండాలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పి ఓట్లు అడుగుతారని, వారి మాటలు నమ్మితే ఆగమైపోతామని బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం ఉరేంటి తండా, బాయిమీది తండా, అడ్కిచెర్ల, పాషాపూర్, జైరాం తండా, రచ్చకట్ట తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు హామీలు ఇస్తారే తప్ప అమలు చేయరని ఆరోపించారు. వారి మాటలకే కాదు మేనిఫెస్టోకు కూడా గ్యారంటీ లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభంజనంలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు తెచ్చానని గుర్తు చేశారు. మరోసారి తనను ఆశీర్వదిస్తే పెద్దేముల్ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఓట్లు అడగడానికి కొత్త బిచ్చగాళ్లు వస్తారని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, అన్నదాతల కోసం రైతు బంధు, రైతు బీమా అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కర్ణాటక రాష్ట్రంలో పట్టిన గతే మనకూ పడుతుందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కరణం పురుషోత్తంరావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, సర్పంచ్, ఎంపీటీసీలు భరత్, జైరాంనాయక్, జ్ఞానేశ్వర్, టోప్యా, ధన్‌సింగ్, జనార్దన్‌రెడ్డి, నర్సింలు, రవినాయక్, ప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో తానుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిన్నతూప్ర, మహేశ్వరం, గంగారం గ్రామాలకు చెందిన నాయకులు ఆమె సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. రూ.వందల కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గంగారం సర్పంచ్ సాలీ వీరానాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

మీర్‌పేట: నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను చూసి మరోమారు ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి ప్రజలను కోరారు. మీర్‌పేట లెనిన్‌నగర్ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ప్రచార రథాలకు గురువారం మంత్రి పూజలు చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కట్టమైసమ్మ అమ్మవారికి పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. అమ్మవారు, ప్రజల ఆశీర్వాదంతో మహేశ్వరం నియోజకవర్గం నుంచి 3వసారి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి లెనిన్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మేయర్ దుర్గ, కార్పొరేటర్లు లావణ్య, బాలమణి, అరుణ, మమత, మీర్‌పేట అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ పాలన తెస్తాం

- బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలి
- కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్



కరీంపూర్‌లో ప్రసాద్‌కుమార్‌కు గజమాల వేస్తున్న నాయకులు

బంట్వారం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను తెలంగాణలో మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం కోట్‌పల్లి మండలం కరీంపూర్, నాగసాన్‌పల్లి, తండా, జిన్నారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మించిన మోసకారి దేశంలో ఎక్కడా లేరన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఆ పార్టీ నాయకులు మరోసారి మోసం చేసేందుకు గ్రామాలకు వస్తారని వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అవినీతి సొమ్ముతో ఓట్లు కొనేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ నేతలకు బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు రెండు సార్లు అవకాశం ఇస్తే ఎక్కడికక్కడ దోచుకొని రాష్ట్రాన్ని ఆగం చేశారని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకుందామన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆనంద్ చేసింది ఏమీ లేదని ఆరోపించారు. నిత్యం అందుబాటులో ఉండే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. అనంతరం కరీంపూర్ ఉప సర్పంచ్ ఉస్మాన్, పలువురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీద్, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కమల' కిరణం


మారుతి కిరణ్

పరిగి: బీజేపీ మూడో జాబితాలో ఆ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థిగా మారుతి కిరణ్‌కు చోటు లభించింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. మారుతి కిరణ్‌ను గెలిపించుకుంటామని నాయకులు పేర్కొన్నారు.

పేరు:	మారుతి కిరణ్ భూనేటి
వయస్సు:	44 సంవత్సరాలు
విద్యార్హత:	బీటెక్, ఎంబీఏ
భార్య:	అర్చన.
సంతానం:	దేవరత్, స్కంద
స్వగ్రామం:	పెద్దగొల్లపల్లి, శంషాబాద్

రాజకీయ ప్రస్థానం: 1990లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌తో ప్రారంభం

పదవులు: 1992లో ఆర్ఎస్ఎస్‌లో స్వయం సేవక్ సంఘ్‌లో ముషిరాబాద్ ముఖ్య శిక్షక్‌గా.. 2004లో ఉమ్మడి రాష్ట్రం బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

అవసరమైతే చెక్‌పోస్టుల పెంపు

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

మాడ్గుల: ప్రతీ ఒక్కరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ రాజశేఖర్, సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో 22 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని.. అవసరమైతే మరిన్ని పెంచుతామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడుగురు రౌడీషీటర్లను బైండోవర్ చేశామని చెప్పారు.

ఇక్కడే ఓనమాలు

కల్వకుర్తికి నాలుగుసార్లు ప్రాతినిథ్యం వహించిన 'సూదిని'



దివంగత కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్ రెడ్డి కల్వకుర్తి నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆయన ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా పదవులను అలంకరించారు. ఆయన 1969 ఫిబ్రవరి 10న కల్వకుర్తి ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీ మెట్లుఎక్కారు. రెండోసారి 1972లో బరిలో నిలిచిన ఆయన 9811 మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో సూదిని కాంగ్రెస్‌ను వీడి జనతాపార్టీలో చేరారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కమలకాంతారావుపై 13,380 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1983లోనూ మరో సారి జనతాపార్టీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బట్టు రుక్మారెడ్డిపై 17,461 ఓట్లతో గెలుపొందారు. వరుసగా గెలుపొందిన జైపాల్ రెడ్డి 1969 నుంచి 1985 వరకు అసెంబ్లీలో తన వాణి వినిపించారు. – ఆమనగల్లు


అచ్యుతారెడ్డి


నందారం సూర్యనారాయణ


నందారం వెంకటయ్య


గురునాథ్‌రెడ్డి


రేవంత్‌రెడ్డి


నరేందర్‌రెడ్డి

కొడంగల్.. దంగల్!

కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఈ నియోజకవర్గం భిన్నమైన తీర్పునకు పెట్టింది పేరు. రాష్ట్రానికి మారుమూల ప్రాంతమైన ఈ సెగ్మెంట్ అభివృద్ధికి దూరంగా ఉన్నా.. రాజకీయంగా మాత్రం విలక్షణ తీర్పునిస్తూ ఓటర్లు తమదైన ముద్ర వేసుకున్నారు. గతంలో రెండు కుటుంబాల మధ్య ఉన్న పోటీ ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు షిఫ్ట్ అయింది.

విలక్షణ తీర్పు సెగ్మెంట్ సొంతం

- ఎన్టీఆర్ హయాంలో కాంగ్రెస్‌కు.. ఉద్యమ సమయంలో సైకిల్‌కు ఓటు
- వలస వచ్చిన నేతను వరించిన అమాత్య పదవి

నియోజకవర్గం వివరాలు

మున్సిపాలిటీలు:	కొడంగల్, కోస్గి
పురుష ఓటర్లు:	1,14.140
మహిళా ఓటర్లు:	1,16,099
ఇతరులు:	12
మొత్తం ఓటర్లు:	2,30,251

కొడంగల్: నియోజకవర్గ ఓటర్లు విలక్షణ తీర్పునివ్వడంలో నిష్ణాతులు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో కాంగ్రెస్ విజయం సాధించింది. 2014లో తెలంగాణ ఉద్యమ సమయంలతో సైకిల్‌కు అవకాశం ఇచ్చారు. నియోజకవర్గం ఏర్పాటు నుంచి కాంగ్రెస్, టీడీపీల మధ్యే ప్రధాన పోరుండేంది. ఈ ఫైట్ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నెలకొంది. కొడంగల్ శాసన సభ్యుల్లో గురునాథ్ రెడ్డి, నందారం వెంకటయ్యలు ముఖ్యులు. గురునాథ్‌రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉండగా.. నందారం వెంకటయ్య మూడు సార్లు ప్రాతినిథ్యం వహించారు. ఇక్కడి ఓటర్లు ఒకసారి కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరోదఫా టీడీపీకి పట్టం కట్టేవారు. ఉప ఎన్నకతో కలిపి ఇక్కడ 15 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గానికి మాత్రం ఒక్కసారి మాత్రమే మంత్రి పదవి వరించింది.



స్వాతంత్రానికి పూర్వమే పురపాలిక

కొడంగల్ పట్టణం స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో మున్సిపాలిటీగా ఉండేది. అప్పట్లో హైదరాబాద్ నవాబుల పాలనలో ఉన్న కర్ణాటకలోని ఇతర పట్టణాలకు వెళ్లాలంటే కొడంగల్ మీదుగా వెళ్లేవారు. వారి హయాంలోనే హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకు కొడంగల్ మీదుగా రహదారి నిర్మించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పూర్వం అంటే 1956 వరకు ఈ నియోజకవర్గం ప్రస్తుత ఈశాన్య కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లాలో ఉండేది.

నియోజకవర్గ ఏర్పాటు

1956లో కొడంగల్ కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలతో పాటు మద్దూరు, దామరగిద్ద మండలాల్లోని పలు గ్రామాలు, కోయిలకొండలోని ఒక గ్రామపంచాయతీ కలిపి నియోజకవర్గంగా ఉండేది. 2018 వరకు కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, మద్దూర్ మండలాలుండగా 2023 ఎన్నికలకు కొత్తగా ఏర్పడిన దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ కలిశాయి. దీంతో నియోజకవర్గంలో ప్రస్తుతం ఎనిమిది మండలాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడంతో కొడంగల్ పట్టణానికి పురపాలిక హోదా దక్కింది.

హస్తానికి ఐదు

నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ ఐదుసార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు నాలుగుసార్లు విజయం సాధించారు. 1996లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ గెలిచింది. 2018లో మొదటిసారి కొడంగల్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. 1994లో టీడీపీ నుంచి గెలిపిన నందారం వెంకటయ్య 1996లో మృతి చెందడంతో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో వెంకటయ్య రెండో కుమారుడు నందారం సూర్యనారాయణ సైకిల్‌పై గెలిచారు.

ఆరుగురిలో అమాత్యుడు ఒక్కరే

నియోజకవర్గ ఏర్పాటు నుంచి 62 ఏళ్లలో ఆరుగురు ప్రాతినిథ్యం వహించగా వలస వచ్చిన నేతకే అమాత్యపదవి వరించింది. నాగర్‌కర్నూల్ నుంచి వచ్చి శాసనసభ్యుడిగా గెలిచిన అచ్యుతారెడ్డికి 1967లో రెవెన్యూ శాఖ మంత్రి పదవి లభించింది.

హ్యాట్రిక్ మిస్

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రెండు సార్లు హ్యాట్రిక్ మిస్ అయింది. 1978, 1983లో వరుసగా విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మరోసారి 1999, 2004లో గెలిచి 2009లో ఓటమి చెందారు. ఇలా ఆనయనకు రెండు సార్లు హ్యాట్రిక్ తప్పింది. ఎనుముల రేవంత్‌రెడ్డి 2009, 2014లో వరుసగా గెలిచారు. 2018లో ఓటమి చవిచూశారు. గతంలో నందారం వెంకటయ్య, గురునాథ్ రెడ్డి కుటుంబాల మధ్యనే రాజకీయం నడిచింది. గెలుపోటవులు ఈ రెండు కుటుంబాల వుధ్యనే ఉండేది.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కొడగంగల్	18225	18603	0	36828
దౌల్తాబాద్	19006	19361	3	38370
మద్దూరు	17843	18359	1	36203
కోస్గి	16895	16984	0	33879
బొంరాస్‌పేట్	15034	15014	7	30055
దుద్యాల	11221	11502	0	22723
కొత్తపల్లి	7788	8032	1	15821
గుండుమాల్	8128	8244	0	16372

సామాజిక వర్గాల వారీగా ఓటర్లు

ముదిరాజులు	60 వేలు
మున్నూరుకాపులు	30 వేలు
గొల్ల, కురుమలు	40 వేలు
రెడ్లు	20 వేలు
ముస్లింలు	20వేలు
ఎస్సీలు	20వేలు
ఎస్టీలు	15 వేలు
వైశ్యలు, బ్రాహ్మణ, కమ్మరి, కుమ్మరి, స్వర్ణకార, ఇతర కులస్తులు	35 వేలు

ప్రాతినిథ్యం వహించిన ఎమ్మెల్యేల వివరాలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1957	అచ్యుతారెడ్డి	కాంగ్రెస్
1962	రుక్మారెడ్డి	స్వతంత్ర
1967	అచ్యుతారెడ్డి	స్వతంత్ర
1972	నందారం వెంకటయ్య	స్వతంత్ర
1978	గురునాథ్‌రెడ్డి	స్వతంత్ర
1983	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్
1985	నందారం వెంకటయ్య	టీడీపీ
1989	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్
1994	నందారం వెంకటయ్య	టీడీపీ
1996	ఉపఎన్నికసూర్యనారాయణ	టీడీపీ
1999	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్
2004	గురునాథ్‌రెడ్డి	కాంగ్రెస్
2009	రేవంత్‌రెడ్డి	టీడీపీ
2014	రేవంత్‌రెడ్డి	టీడీపీ
2018	నరేందర్‌రెడ్డి	టీఆర్ఎస్

పంచాయతీ టు అసెంబ్లీ

ఉమ్మడి రాష్ట్రానికి ముగ్గురు ఎమ్మెల్యేలను ఇచ్చిన పెద్దమంగళారం

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం రాజకీయ కీర్తిని ఘడించింది. ఉమ్మడి రాష్ట్రానికి ముగ్గురు ఎమ్మెల్యేలను అందించి రాజకీయ చరిత్రకెక్కింది. 1952, 1957లో షాబాద్ ఎమ్మెల్యేగా, 1959లో రెవెన్యూ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి పెద్దమంగళారం వాసి. 1978–82 మధ్యకాలంలో చేవెళ్ల ఎమ్మెల్యేగా ఉన్న చిరాగ్ ప్రతాప్‌లింగం గౌడ్, 1983–85 మధ్యకాలంలో చేవెళ్ల ఎమ్మెల్యే పదవిలో ఉన్న కొండా లక్ష్మారెడ్డి పెద్దమంగళారం పంచాయతీకి చెందినవారే.



నిస్వార్థ జీవితం


చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్

1952లో సోషలిస్టు పార్టీ నుంచి కేవీ రంగారెడ్డిపై పోటీ చేసి ఓటమి పాలైన చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్ సైతం పెద్దమంగళవారం వాసియే. ఆయన 1978లో జనతా పార్టీ నుంచి చేవెళ్ల ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లెక్కారు. ఆది నుంచే ప్రజాసేవకు అంకితమైన ఆయన మొయినాబాద్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఏర్పాటుకు కృషి చేశారు. నిస్వార్థ జీవితం గడిపిన ఆయన ఎమ్మెల్యే పదవిలో ఉండగానే 1982 నవంబర్ 2న అనారోగ్యంతో మరణించారు. ఆయన మరణానంతరం భార్య, పిల్లలు గ్రామం వదిలి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారి కుటుంబానికి గ్రామంలో ఆస్తులేమీ లేవు.

ఉప ఎన్నికలో కొండా లక్ష్మారెడ్డి




చేవెళ్ల ఎమ్మెల్యేగా ఉన్న చిరాగ్ ప్రతాప్ లింగంగౌడ్ 1982 నవంబర్‌లో అనారోగ్యంతో మరణించడంతో 1983లో జరిగిన ఉప ఎన్నికల్లో కొండా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత మూడు పర్యాయాలు హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మూడుసార్లు పోటీ చేసి ఓటమిచెందారు. ఈయన కొండా వెంకట రంగారెడ్డికి మనువడు. మరో మనువడు కొండా విశ్వేశ్వరరెడ్డి 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా విజయం సాధించారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

విలీనానికి వ్యతిరేకం కేవీఆర్


కేవీ రంగారెడ్డి

1890 డిసెంబర్ 12న పెద్దమంగళారంలో రైతు కుటుంబంలో జన్మించిన కొండా వెంకట రంగారెడ్డి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జమీందార్లకు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఆయన రైతుల పక్షాన పోరాటం చేశారు. ఆ సమయంలో జైలు జీవితం సైతం అనుభవించారు. 1952–57 వరకు షాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రాలో విలీనం చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్దమనుషుల ఒప్పందంలో ఆయన కీలక భూమిక పోషించారు. 1959లో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన ఆయన అనంతరం ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 1969లో తెలంగాణ ఉద్యమాన్ని లేవనెత్తి ప్రత్యేక రాష్ట్రంకోసం పోరాటం చేశారు. 1970 జూలై 24న ఆయన తుదిశ్వాస విడిచారు.




మోమిన్‌పేట మండల ముఖచిత్రం

మోమిన్‌పేట మొగ్గు.. ఎవరైనా నెగ్గు!

- మండలం నుంచి మెజార్టీ వచ్చిన వారిదే విజయం
- నలభై ఏళ్లుగా కొనసాగుతున్న చరిత్ర
- ఏసీఆర్ నుంచి ఆనంద్ వరకు ఎమ్మెల్యేల గెలుపులో కీలక భూమిక
- ఈసారి పట్టం ఎవరికో?

మోమిన్‌పేట: గడిచిన నలభై సంవత్సరాలుగా మోమిన్‌పేట మండల ప్రజలు మద్దతు తెలిపిన అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. 2008 ఉప ఎన్నిక, 2009 సాధారణ ఎన్నికలను మినహాయిస్తే మిగిలిన ప్రతీసారి ఇక్కడి ఓటర్లు కాంగ్రెసేతర పార్టీలకే జైకొట్టారు. 1985లో వికారాబాద్ సెగ్మెంట్ నుంచి టీడీపీ తరఫున మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తొలిసారి ఎమ్మెల్యే ఎన్నికల బరిలో నిలిచారు. అప్పట్లో మోమిన్‌పేట నుంచి ఆయనకు మంచి మెజార్టీ లభించింది. అనంతరం 1989, 1994, 1999లోనూ టీడీపీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. 2004లో చంద్రశేఖర్ టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పొత్తుతో బరిలో నిలవగా టీఆర్ఎస్‌కు ఆదరణ లభించింది. 2008 ఉప ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ పోటీపడ్డాయి. ఈసారి మోమిన్‌పేట మండల ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచి మెజార్టీ దక్కిన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. 2018లో జరిగిన ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ కేండెట్‌కు ఎక్కువ ఓట్లు రాగా గులాబీ అభ్యర్థి విజయం సాధించారు. ఇలా ప్రతీసారి ఎమ్మెల్యేల గెలుపులో మోమిన్‌పేట మండలం ఎంతో ప్రభావం చూపింది.

ఏసీఆర్ నాలుగు సార్లు..



1985లో టీడీపీ నుంచి పోటీ చేసిన చంద్రశేఖర్ 2004వరకు వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఆయనకు కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా పోటీ చేసే అవకాశం వచ్చింది. అప్పుడు కూడా మండల ఓటర్లు ఏసీఆర్‌కు జైకొట్టారు. 2008 ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన గడ్డం ప్రసాద్‌కుమార్ విజయం సాధించారు. అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ హస్తం పార్టీ నుంచి పోటీ చేసిన ప్రసాద్‌కుమార్ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ రెండు సార్లు మోమిన్‌పేట ప్రజలు ప్రసాద్‌కుమార్‌కు మెజార్టీ ఇచ్చారు. దీంతో రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థి విజయ కేతనం ఎగురవేసింది. ఇలా ప్రతీ అభ్యర్థి గెలుపులోనూ మోమిన్‌పేట ఓటర్ల తీర్పు గెలుపోటములను డిసైడ్ చేసింది. 1994లో స్వతంత్ర అభ్యర్థిగా, 2004లో టీడీపీ నుంచి ఓటమి పాలైన సంజీవరావు 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేయగా.. మోమిన్‌పేట నుంచి మెజార్టీ దక్కి విజయం సాధించారు. 2018లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు మోమిన్‌పేట ఓటర్లు మెజార్టీ ఇచ్చారు. దీంతో ఆయన సైతం విజయం సాధించారు. ఈసారి హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల పోరాటంలో మోమిన్‌పేట ప్రజలు ఎవరికి పట్టం కడుతారో వేచి చూడాల్సిందే.

'పాలమూరు' పయనమెటో..?

సాధారణ వ్యక్తి తన సేవలతో శక్తిగా మారాడు. ఓ వైపు సేవా కార్యక్రమాలను చేపడుతూనే బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేశాడు. కానీ కమలం కాదంది. దీంతో ఆయన సందిగ్ధంలో పడిపోయారు. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా 'పాలమూరు' పయనంపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి.

- విష్ణువర్ధన్‌రెడ్డిని పక్కన పెట్టిన కమలం
- అందె బాబయ్యకే అధిష్టానం దీవెనలు


విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: నియోజకవర్గంలో ఏళ్ల నుంచి పాలమూరు చారిటబుల్ ట్రస్టు పేరిట విష్ణువర్ధన్‌రెడ్డి సేవా కార్యక్రమాలు చేపడుతన్నారు. కోవిడ్ సమయంలో ఆయన చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఉచిత మందుల పంపిణీ, వేసవిలో అంబలి కేంద్రాల ఏర్పాటు, యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్‌ల పంపిణీ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన తదితర కార్యక్రమాలు చేపట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్

షాద్‌నగర్ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ కోసం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, ఏపీ మిథున్ రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేశారు. అయితే చివరికి పార్టీ అధిష్టానం ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన అందె బాబయ్య వైపు మొగ్గు చూపింది. బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ప్రధాన అనుచరుడిగా పేరొందిన బాబయ్యకు సైతం నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండటంతో పాటుగా ఈటలతో ఉన్న సత్సంబంధాలు ఆయనకు లైన్ క్లియర్ చేసినట్లు చర్చించుకుంటున్నారు.

అనుచరుల్లో అసంతృప్తి

పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి కమలం టికెట్ నిరాకరించడంతో ఆయన అనుచరులు అసంతృప్తిలో ఉన్నారు. టికెట్ ఆయనకే వస్తుందనే ధీమాతో ప్రచార రథాలు తయారు చేయించి గ్రామాల్లో సమావేశాలు, ర్యాలీలు చేపట్టారు. వివిధ పార్టీల నుంచి నేతలను, యువతను కమలం గూటికి తీసుకువచ్చారు. టికెట్ రాకపోవడంతో అనుచరులు అయోమయం చెందుతున్నారు.

బరిలో నిలుస్తారా.?

ఎన్నికలే టార్గెట్‌గా పనిచేసుక్ను పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నిర్ణయంపై నియోజకవర్గమంతా చర్చించుకుంటోంది. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏవిధంగా ఉంటుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఆయన బాబయ్యకు మద్దతిస్తారా..? ఇండిపెండెంట్‌గా బరిలో నిలువనున్నారా అనే అంశంపై చర్చ సాగుతోంది. విష్ణువర్ధన్‌రెడ్డి రెండు రోజుల్లలో తన అనుచరులతో భేటీ తర్వాత కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లో సహాయ నిరాకరణ!

సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా ఆచితూచి ఎన్నికల బరిలో దింపుతున్న అభ్యర్థులకు 'స్థానిక'ంగా సహాయ నిరాకణ ఎదురు కావడం ఆందోళన కలిగిస్తోంది. పార్టీ టికెట్ ఆశించి భంగపడిన నేతల అసంతృప్తి చల్లారడం లేదు. ఇప్పటికే పలు నియోజకవర్గాలకు చెందిన అసమ్మతి వాదులు ఏకంగా అగ్రనేతలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ ఇతర పార్టీల్లో చేరిపోగా, మరికొందరు పార్టీ వదలకుండా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ అభ్యర్థుల ప్రచారానికి దూరం పాటిస్తున్నారు. పార్టీ పరంగా అధికారికంగా ఖరారైన అభ్యర్థులు సైతం అస మ్మతి నేతలను పట్టించుకోకపోవడంతో మరింత అగాధం పెరిగిపోతోంది. మరికొందరు అస్మతి నేతలు తమ అ నుచరులను గాంధీభవన్‌కు పంపించి ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా గురువారం నగర శివారులోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడిన దండెం రాంరెడ్డి అనుచరులు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. కార్యాలయంలో చొచ్చుకెళ్లి కుర్చీలు ధ్వంసం చేశారు.

సైలెంట్‌గా..

మహేశ్వరంలో బండంగ్‌పేట మేయర్ పారిజాత తిరుగుబాటు బావుటా ఎగరవేసేందుకు సిద్ధమవుతుండగా రంగారెడ్డి డీసీసీ చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డిలు, ఎల్బీనగర్‌లో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్రనగర్‌లో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వేణుగోపాల్, గౌరి సతీష్‌లు, కంటోన్మెంట్‌లో సర్వే సత్యనారాయణ సహాయ నిరాకరణకు దిగారు.